# కాంగ్రెసోళ్ల కళ్లు బైర్లు కమ్మాయి

- అడ్డంకులు సృష్టించినా బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా జనం
- వరంగల్ నుంచి తొర్రూరు వరకు ట్రాఫిక్ జామ్
- సభ సక్సెస్ అనడానికి ఇదే నిదర్శనం
- తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- పార్టీ తొర్రూరు మండల అధ్యక్షుడు సీతారాములు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తొర్రూరు, ఏప్రిల్ 28: ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను చూసి కాంగ్రెసేళ్ల కళ్లు బైర్లు కమ్మాయని పార్టీ తొర్రూరు మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభకు తరలివచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని కొన్ని వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు ప్రజలను బెదిరించేందుకు ప్రయత్నించారని, సభకు రవాణా కోసం ఏర్పాటు చేసిన ప్రైవేట్ బస్సులను నిలిపివేయించారని, అయినా ప్రజలు స్వచ్ఛందంగా సభకు హాజరయ్యారని పేర్కొన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నాయకత్వంలో లక్షలాది మంది తరలారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డీటీఓ అధికారులపై ఒత్తిడి తెచ్చి బస్సులను నిలిపివేయించినప్పటికీ, ప్రజలను ఆపలేకపోయారని అన్నారు. సభ నేపథ్యంలో వరంగల్ నుంచి తొర్రూరు వరకు సుమారు 80 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిందని, ఇది సభ విజయవంతమైందనడానికి నిదర్శనమన్నారు. ఇది చూసి కాంగ్రెస్ పార్టీ నేతలు తట్టుకో లేక వాగుతున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జడ్పీటీసీ మంగలపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, పట్టణ అధ్యక్షులు బిందు శ్రీనివాస్, శ్రీనివాస్, పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.ప్రదీప్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు ఎన్నమనేని శ్రీనివాసరావు, మనిరాజు, తుర్పాటి రవి, శంకర్, జైసింగ్, అంకూస్, కాలునాయక్, రాయేశెట్టి వెంకన్న, జాటోత్ స్వామి, భాస్కర్, సోమలింగం, డిష్ శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ సక్సెస్‌పై కృతజ్ఞతలు

మహబూబాబాద్ రూరల్/దంతాలపల్లి/దంతాలపల్లి, ఏప్రిల్ 28 : హనుమకొండ ఎల్కతుర్తిలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు అశేష జనం తరలి వచ్చి విజయవంతం చేసినందుకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత సోమవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజలు, కేసీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలారని, తెలంగాణ చరిత్రలో నిలిచేలా భారీ సభను విజయవంతం చేయడంలో భాగస్వాములైనందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ నెల్లికుదురు మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నల్లాని నవీన్ రావు, పార్టీ దంతాలపల్లి మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు కృతజ్ఞతలు తెలిపారు. సభకు స్వచ్ఛందంగా తరలివచ్చిన జనాన్ని చూసేందుకు రెండు కళ్లు సరిపోలేదని, సభ తీరు చూశాక కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. ఈ సభతో కేసీఆర్ మళ్లీ సీఎం కావడాన్ని ఎవరూ అడ్డుకోలేరని తేలిందని పేర్కొన్నారు.

## రైళ్లను పునరుద్ధరించాలి

డోర్నకల్, ఏప్రిల్ 28: కోవిడ్ సమయంలో నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించాలని డీఆర్‌యూసీసీ మెంబర్ మైనుపాషా సోమవారం ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. బెల్గావి – హైదరాబాద్ – మణుగూరు ఎక్స్‌ప్రెస్ (07335/ 07336), డోర్నకల్ – భద్రాచలం రోడ్డు, (57145/ 57146), మణుగూరు – కాజీపేట (మణుగూరు ప్యాసింజర్, 57657/ 57658), కాజీపేట – విజయవాడ ప్యాసింజర్ (67211/ 67212), విజయవాడ – పెద్దపల్లి ప్యాసింజర్, (77251/ 77254) రైళ్లను పునరుద్ధరించాలని కోరారు.

## అదుపు తప్పిన బైక్.. ఒకరికి తీవ్రగాయాలు



గాయాలైన వీరన్న

నెల్లికుదురు, ఏప్రిల్ 28: బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మదనతుర్తికి చెందిన కొమ్మనబోయిన వీరన్న నెల్లికుదురులో ఉంటూ మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం నెల్లికుదురు నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తూ మదనతుర్తి బస్టాండ్ సమీపంలో వాహనం అదుపు తప్పి కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## రిసోర్స్ పర్సన్స్ ఎంపికకు నేడు డెమో

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్‌లో రిసోర్స్ పర్సన్స్ ఎంపిక కోసం మంగళవారం డెమో, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు. వివిధ సబ్జెక్ట్‌లకు డీఆర్పీలుగా, రిసోర్స్ పర్సన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ పట్టణంలోని అనంతారం ఆదర్శ పాఠశాలలో డెమో, ఇంటర్వ్యూ ఉంటుందని డీఈవో పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సమ్మర్ స్పెషల్ ఆఫర్

★ శ్రీశైలి బ్యూటీ పార్లర్ Only అడ్మిషన్ ఫీ 2,000/- with సర్టిఫికెట్ ఫ్రీ, బ్యూటీషన్, మగ్గం వర్క్ కోర్స్ నేర్పించబడును. వెంటనే సంప్ర: Call Me: 9989060668.
NTW-15698

WANTED

★MS Office & Multimedia Teaching చేయుటకు Trainer (Full Time / Part Time) కావలెను. Monthly Salary Rs. 15,000/-. Vidyarthi Computers. Cell: 6309013619
NTW-6586

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## తోరణాల తొలగింపులో అత్యుత్సాహం

- ఆదివారం అర్ధరాత్రే తీసేసిన జీపీ సిబ్బంది
- బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆగ్రహం



రాత్రి వేళ బీఆర్ఎస్ పార్టీ తోరణాలను తొలగిస్తున్న జీపీ సిబ్బంది

బయ్యారం, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో కట్టిన గులాబీ తోరణాల తొలగింపులో గ్రామ పంచాయతీ అత్యుత్సాహం ప్రదర్శించడంపై బీఆర్ఎస్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక గాంధీసెంటర్‌లో కట్టిన తోరణాలను ఎల్కతుర్తిలో సభ ముగియకముందే ఆదివారం రాత్రి జీపీ సిబ్బంది నిచ్చెనలు వేసుకొని మరీ తొలగించారు. ఎలాంటి ఎన్నికల కోడ్ లేకున్నా తోరణాలు తొలగించటంపై మండిపడ్డారు. దీనిపై జీపీ సెక్రటరీ శ్రీధర్‌ను వివరణ కోరగా తొలగింపు విషయం తనకు తెలియదని, తెలిసిన వెంటనే వారిని మందలించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాత గణేశ్, గంగుల సత్యనారాయణ ఎంపీడీవో విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. వారు మాట్లాడుతూ రజతోత్సవ సభ పూర్తి కాకముందే తోరణాలు తొలగించటం సరికాదని, గ్రామ పంచాయతీ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కొందరి ఒత్తిడి మేరకే తొలగించాలని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఇలా చేయడం మంచిది కాదని హితవుపలికారు.



జీపీ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## క్షుద్రపూజల కలకలం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : పట్టణంలోని తల్లారి వెంకటేశ్వర్లు కాలనీలో ఆదివారం క్షుద్రపూజల కలకలం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో ఆదివారం రాత్రి రోడ్లపై నిమ్మకాయలు, కొబ్బరి కాయలతో అన్నం కలిపి పసుపు పెట్టారు. వాటిని చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

## మృతుల కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : పట్టణానికి చెందిన న్యూడెమోక్రసీ పార్టీ సీనియర్ నాయకుడు మండల వెంకన్న సతీమణి అరుణశ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె చిత్రపటానికి సోమవారం ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మార్నేని వెంకన్న, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.



అరుణశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

## ఆలయ చరిత్రను సీతారాంనాయక్ తెలుసుకోవాలి

మరిపెడ, ఏప్రిల్ 28: మాకుల వేంకటేశ్వర స్వామి ఆలయ చరిత్రను మాజీ ఎంపీ సీతారాంనాయక్ తెలుసుకొని మాట్లాడాలని గ్రామస్తులు అన్నారు. సోమవారం మాకుల ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధిగా చేసిన సీతారాంనాయక్ భక్తులను అయోమయానికి గురిచేసేలా మాట్లాడటం సరికాదన్నారు. గ్రామస్తులు ముద్దిరెడ్డి బుచ్చిరెడ్డి, గంట్ల రంగారెడ్డి, బోడ రమేశ్, చారి, మధు పాల్గొన్నారు. కాగా, ఆలయ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ.2లక్షల 88వేల 543 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వేణుగోపాల్ తెలిపారు.

## వడదెబ్బతో ఒకరి మృతి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : వడదెబ్బతో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి కథనం ప్రకారం.. లక్ష్మాతండా శివారులో బీహార్ రాష్ట్రానికి చెందిన తులసీముషారఫ్ (59) కొంత కాలంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా ఓ కాంట్రాక్టర్ వద్ద కూలీకి పనులు చేస్తున్నాడు. మూడు రోజుల నుంచి ఎండలోనే పనిచేయడంతో వడదెబ్బతగిలి సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు దవాఖానకు తరలించే లోపే మృతిచెందాడు. వారి కుటుంబ సభ్యుడు వీరేందర్‌రాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు



పెద్దవంగర: కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

తొర్రూరు/పెద్దవంగర, ఏప్రిల్ 28: భూభారతి చట్టం–2025పై అవగాహన సదస్సులు సోమవారం తొర్రూరులోని రైతు వేదిక, పెద్దవంగర మండల కేంద్రంలోని వడ్డె కొత్తపల్లి రైతు వేదికలో జరిగాయి. కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే వీరబ్రహ్మచారి, ఆర్డీఓ గణేశ్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ కొత్త చట్టం ద్వారా భూ సమస్యలు వేగంగా పరిష్కారమవుతాని తెలిపారు. వెలికట్టేలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి ప్యాడీ క్లీనర్, మాయిశ్చర్ స్థాయి, ధాన్య రిజిస్టర్లు తదితరాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలన్నారు. పెద్ద వంగరలోని కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి ప్యాడీ క్లీనర్, మాయిశ్చర్, ధాన్యానికి సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించారు. సరిపడా గన్నీ సంచులు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ ఏడీ నరసింహమూర్తి, జిల్లా డీపీఆర్ఓ రాజేంద్రప్రసాద్, తొర్రూరు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పూర్ణచందర్‌రెడ్డి, ఏడీఏ విజయచంద్ర, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, పెద్దవంగర తహశీల్దార్ మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఏడీఏ విజయ్‌చంద్ర, ఏవో స్వామి, పీఏసీఎస్ సీఈవో మురళి పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ అవినీతిపై విచారణ చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : సబ్ రిజిస్ట్రార్ హెచ్ రవి అవినీతి, అక్రమ ఆస్తులపై విచారణ జరిపించాలని జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వరరావు సోమవారం అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2009 నుంచి 2021 వరకు లాంగ్ స్టాండింగ్‌లో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తూ సుమారు రూ.800కోట్ల విలువైన అక్రమ ఆస్తులను సంపాదించాడని ఆరోపించారు. ప్రభుత్వ భూములకు బై నంబర్లు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఆరోపించారు.

## అమ్మాపురంలో పగలే చోరీ

తాళం పగులగొట్టి ఇంట్లోని రూ.60వేల నగదు అపహరణ

తొర్రూరు, ఏప్రిల్ 28: పట్టపగలే ఇంటి తాళం పగులగొట్టి గుర్తుతెలియని మహిళ చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని అమ్మాపురంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మార్క పెద్ద లక్ష్మయ్య సోమవారం గ్రామంలో బంధువు పదో రోజు కార్యక్రమం ఉన్నందున ఇంటికి తాళాలు వేసి, పిట్టకు పెట్టేందుకు వెళ్లాడు. ఉదయం సుమారు 11గంటలకు గుర్తుతెలియని మహిళ ఇంటికి రెండు వైపులా తలుపులకు ఉన్న తాళాలను పగులగొట్టి బీరువాలోని రూ.60వేల నగదు అపహరించినట్లు తెలిపారు. గ్రామంలో కాటమయ్య పండుగ సందర్భంగా ఖర్చు కోసం తెచ్చుకున్న డబ్బులు చోరీకి గురైనట్లు బాధితుడు బోరున రోదించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గొల్లమూడి ఉపేందర్ తెలిపారు.

## అంతరాలు లేని విద్యను అందించాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : ప్రభుత్వం అంతరాలు లేని విద్యను అందించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్ అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పీఎంశ్రీ పాఠశాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ గురుకులాలతోపాటు మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లోనూ అంతే ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి, వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. మురళీకృష్ణ, షేక్ యాకుబ్, శ్రీనివాసులు, స్వప్న, నాగమల్లయ్య, రాజశేఖర్, మంగీలాల్ పాల్గొన్నారు.

## తెలుగు మహాసభలకు సంకెపల్లి దంపతులు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : మే 10, 11 తేదీల్లో ఏలూరులో జరిగే ప్రపంచ తెలుగు మహాసభలకు పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కీర్తనారెడ్డి దంపతులు హాజరు కానున్నారు. అందులో కవిత గానం, కవిత పఠనం చేయనున్నట్లు పేర్కొన్నారు. వారికి స్థానిక కవులు, రచయితలు, విద్యావేత్తలు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# ఫ్లెక్సీల ఏర్పాటుపై కాంగ్రెస్ నాయకుల ఘర్షణ

నేడు దంతాలపల్లికి రానున్న మంత్రి పొంగులేటి



దంతాలపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడితో ఘర్షణ పడుతున్న నాయకులు

తొర్రూరు/ దంతాలపల్లి, ఏప్రిల్ 28: మండల కేంద్రంలో భూభారతి చట్టం–2025పై నిర్వహించే అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం రానున్నారు. ఈమేరకు ఏర్పాటు చేసే ఫ్లెక్సీల విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం వేదికపైనే ఘర్షణ పడ్డారు. భూభారతి చట్టం అమలుకు దంతాలపల్లి పైలట్ మండలంగా ఎంపికైంది. కొత్త చట్టంపై నిర్వహించే అవగాహన సదస్సుకు మంత్రితోపాటు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ ముఖ్య అతిథులుగా రానున్నారు. మంత్రి తొర్రూరులోని యతిరాజారావు పార్కులో హెలికాప్టర్ ద్వారా ల్యాండ్ అవుతారని, అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో దంతాలపల్లికి చేరుకుంటారని స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. అయితే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని మండల అధ్యక్షుడు చెప్పగా నాయకులు వెంటనే 'నీది నీవు చూసుకో.. మాకు నివ్వేంది చేప్పేది' ప్రశ్నించారు. 'నువ్వు ఎన్ని ఫ్లెక్సీలు పెడుతున్నవో చెప్పు' అని ఓ సీనియర్ నాయకుడు మండల అధ్యక్షుడితో ఘర్షణకు దిగాడు. అక్కడే ఉన్న నాయకులు ఇద్దరికీ నచ్చజెప్పి పంపించారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇస్లావత్ నరేశ్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మహబూబాబాద్ మండలం మాధవపురం శివారు ఇస్లావత్ తండా(ఎం) గ్రామ పంచాయతీకి చెందిన నరేశ్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద తండాలో అంతర్గత రోడ్డు నిర్మాణం రూ.5లక్షలు మంజూరయ్యాయని, ఆ రోడ్డు తండా శివారులో ఓ వ్యకి పౌల్ట్రీ ఫాం వెళ్లేందుకు సీసీ రోడ్డు వేసినట్లు తెలిపాడు. సంబంధిత ఈజీఎస్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తండాలో కొందరు చెరువు శిఖం భూములను ఆక్రమించి కట్టడాలు నిర్మించారని, వారిపై రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నెల్లికుదురు మండలం నుంచి శ్రీనివాసులు తన భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేసుకున్నాడు. కేసముద్రం మండలంలో శ్రీరాములు తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. రెవెన్యూ శాఖకు 12, పంచాయతీ రాజ్ శాఖకు 8 మొత్తం 39 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

# ఆర్డీవో కార్యాలయం ఎదుట వృద్ధురాలి నిరసన



నిరసన తెలుపుతున్న వృద్ధురాలు సుశీల

తొర్రూరు, ఏప్రిల్ 28: భూమిని కుమారుడు అక్రమంగా పట్టా చేసుకుని, తన యోగక్షేమాలు చూసుకోవడం లేదని వృద్ధురాలు యెల్ది సుశీల సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. మరిపెడ మండలం రాంపురానికి చెందిన యెల్ది సుశీల, భర్త మృతికి ముందు భూమి కొడుకులకు పంచారు. 18 ఎకరాల్లో తన వాటా మినహాయించి, ప్రభుత్వ ఉద్యోగి అయిన చిన్న కుమారుడు రమేశ్ మరో 2.5 ఎకరాలు అక్రమంగా పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. దీనిపై ప్రశ్నించగా తల్లిని బెదిరించినట్లు తెలిపారు. తాజాగా రమేశ్ ఆక్రమించిన భూమిని విక్రయించగా, వృద్ధురాలు కలెక్టర్, సీసీఎల్ఏలను ఆశ్రయించారు. ప్రస్తుతం ఆ భూమి తన పేర చేర్చాలని, తన యోగక్షేమాలను సంరక్షించాలని సుశీల డిమాండ్ చేసింది.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తిప్పికొట్టాలి

కొత్తగూడ, ఏప్రిల్ 28: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పని గంటల పెంపుదల, లేబర్ కోడ్స్‌ను అన్ని రంగాల కార్మికులు మే డే సందర్భంగా ఐక్యంగా ఉద్యమించి తిప్పికొట్టాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫర్ ఇండియా జిల్లా నాయకుడు ల్యాదల్ల రాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మే డే పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు కంగాల పాపన్న, చిద్రబోయిన పాపన్న, శిరబోయిన గిరి, బొబ్బల కృష్ణ, రవి, శ్రీను, ప్రభాకర్, శశీందర్, ఆదిత్య పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

## మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి


మహబూబాబాద్ రూరల్/ దంతాలపల్లి, ఏప్రిల్ 28 : కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో వెంటనే శాంతి చర్చలు జరపాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. సోమవారం పట్టణంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు ఖనిజ సంపద అప్పగించేందుకు అడవుల్లో జీవిస్తున్న ఆదివాసీలు, గిరిజనులను ఖాళీ చేసేదుకు కేంద్ర బలగాలను దించి దాడులు చేయిస్తోందని పేర్కొన్నారు. దేశంలోని సమస్యలను పరిష్కరించకుండా ప్రశ్నించేవారిపై దాడులు చేయటం సరికాదన్నారు. ఓ వైపు మేధావులు శాంతి చర్చలు జరపాలని చెబుతున్నా దాడులు ఆపయడంలేదన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లింగన్న, దేవేందర్, సూర్యం, చైతన్య, మధు పాల్గొన్నారు. కాగా, న్యూ డెమోక్రసీ, ఉద్యమకారుల ఐక్య వేదిక, బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం దంతాలపల్లి మండల కేంద్రంలో శాంతి ప్రదర్శన నిర్వహించారు. కేంద్రం చేస్తున్న దాడులతో ఆదివాసులు, గిరిజనలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయానక వాతావరణంలో ఉంటున్నారని తెలిపారు. నాయకులు ఊడుగుల లింగన్న, మిడతపల్లి వెంకన్న, ఏడ్ల శ్రీను, యాకసాయిలు, నరేష్, సాయిలు, సంపత్, వెంకన్న, వెంకట్‌రెడ్డి, అన్వేష్ పాల్గొన్నారు.




దంతాలపల్లి: శాంతి ప్రదర్శన నిర్వహిస్తున్న ఎన్డీ నాయకులు

## ఆదివాసీలపై దాడులను అరికట్టాలి

గార్ల, ఏప్రిల్ 28: ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జడ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చేపల మార్కెట్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పక్రు, భద్రయ్య, మాన్య నాయక్, మనోహర్, రాములు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

## 'ఆదివాసీల అంతం కోసమే కేంద్రం కుట్ర'

కొత్తగూడ, ఏప్రిల్ 28: ఆదివాసీల అంతం కోసమే కేంద్రం కుట్ర చేస్తోందని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కుంజ నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలో జీపీ ఆవరణలో మండల అధ్యక్షుడు ఈక విజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడవిలోని విలువైన ఖనిజ సంపద, కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు బీజేపీ సిద్ధపడిందన్నారు. నాయకులు పూణెం సురేందర్, ఈక సాంబయ్య, సిద్దబోయిన లక్ష్మినారాయణ, బంగారు సారంగపాణి, భూపతి రమేశ్ పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుడు బుచ్చిరెడ్డి మృతి



బుచ్చిరెడ్డి (ఫైల్)

బయ్యారం, ఏప్రిల్ 28: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు రెంటాల బుచ్చిరెడ్డి సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన బుచ్చిరెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. మిలియన్ మార్చ్, సాగరహారం, వంటావార్పులు వంటివాటిల్లో చురుగ్గా పాల్గొనగా పోలీస్ కేసులు కూడా నమోదయ్యాయి. సమైక్య రాష్ట్రంలో బయ్యారం ఇనుప గనుల దోపిడీకి వ్యతిరేకంగా గనుల పరిరక్షణ ఉద్యమం, అఖిల పక్ష సభ్యుడిగా గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా పదేండ్ల పాటు పార్టీ బలోపేతానికి పనిచేశారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, జడ్పీ మాజీ చైర్మన్ అంగోత్ బిందు సంతాపం తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, ఎన్డీ నాయకులు గౌని ఐలయ్య, బీఆర్ఎస్ నాయకులు అంగోత్ శ్రీకాంత్, ఏనుగుల ఐలయ్య, సత్యనారాయణ, శ్రీను, వీరభద్రం మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

## ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్న జీపీ సిబ్బంది

గార్ల, ఏప్రిల్ 28: గార్ల మేజర్ గ్రామ పంచాయతీలో వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మండల కేంద్రంలో పుట్టకోట బజార్, దంపక బజార్, తహసీల్దార్ బజార్, అంబేద్కర్ నగర్, పుమ్యా తండాల్లో నీటిని సరఫరా చేస్తున్నారు.

# అక్కను బస్సు ఎక్కించి వస్తూ..

- బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఫత్తేపురం స్టేజీ సమీపంలో ప్రమాదం
- హాస్పిటల్‌కు తరలిస్తుండగా విద్యార్థి మృతి



శ్రీమంజునాథ్ (ఫైల్)

తొర్రూరు, ఏప్రిల్ 28: లారీ బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. ఎస్సై గొల్లమూడి ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన రొయ్యల శ్రీమంజునాథ్(17) ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. అక్క శ్రీనిధిని హైదరాబాద్‌కు వెళ్లేందుకు సోమవారం తెల్లవారుజామున 5.30 గంటలకు ఇతరుల బైక్‌పై తీసుకెళ్లి తొర్రూరులో బస్సు ఎక్కించి తిరిగి దంతాలపల్లికి వస్తున్నాడు. ఫత్తేపురం స్టేజీ సమీపంలో వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై, మైనర్‌కు బైక్ ఇచ్చిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# వాహనాల అతివేగం ప్రాణాపాయం



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు, సీఐ రవికుమార్

బయ్యారం, ఏప్రిల్ 28: వాహనాల అతివేగంతో ప్రాణాపాయమని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు అన్నారు. మండలంలోని నామాలపాడు, కొత్తపేట, గంధంపల్లి, సత్యనారాయణపురం గ్రామాల్లోని ఎన్‌హెచ్ 930–పీలో ప్రమాదాలు జరిగే మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మూల మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. అధిక శాతం మంది యువకులు అతివేగంతో ప్రాణాలు కోల్పోతున్నారని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. సీఐ రవి కుమార్, ఎస్సై తిరుపతి ఉన్నారు.